# కొర్రీలు లేకుండా 'మాఫీ' చేయాల్సిందే..

- అశ్వాపురం ఏవోకు పలు గ్రామాల రైతుల ఫిర్యాదు
- పండగపూట కూడా బారులు తీరిన రైతులు
- నూరు శాతం వర్తింపజేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరిక


అశ్వాపురంలో రుణమాఫీపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వివిధ గ్రామాల రైతులు

అశ్వాపురం, ఆగస్టు 19 : ప్రభుత్వం ఎలాంటి షరతులు, కొర్రీలు పెట్టకుండా అర్హులైన రైతులందరి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది రైతులు సోమవారం వ్యవసాయాధికారిని కలిసి ఫిర్యాదు చేయడంతోపాటు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పట్టాదారు పాస్ పుస్తకం లేని కారణంగా కొందరికి రుణమాఫీ జమ కాలేదని, రూ.2 లక్షల రుణం దాటిన వారికి వర్తించలేదని, బ్యాంకు అధికారులు, అధికారుల పొరపాట్ల కారణంగా మరికొందరికి రుణమాఫీ కాలేదంటూ ఫిర్యాదులు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన విధంగా తమ పంట రుణం మాఫీ అవుతుందని ఎంతగానో ఎదురుచూసినా నిరాశే మిగిలిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తాము ఏ అధికారి చుట్టూ తిరగకుండానే రుణమాఫీ వర్తించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పండగపూట కూడా ఇంటి వద్ద ప్రశాంతంగా ఉండనీయకుండా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయించడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం పెట్టిన షరతులను తొలగించి నూరు శాతం రుణమాఫీ వర్తింపజేయాలని, లేదంటే అందరం ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

# రుణగోల..

రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. "మా రుణాలు మాఫీ కాలేదు మహాప్రభో" అంటూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏమిచేయాలో తోచక అయోమయంలో ఉండిపోయారు. రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక రకాల కొర్రీలు పెట్టి తమకు కర్రుతో వాతపెట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని లక్షల అప్పు ఉంటే ఏంటీ ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకూ రూ.2 లక్షలు మాఫీ చేయొచ్చు కదా! అంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన రైతులే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రూ.2 లక్షలకు పైగా అప్పు ఉన్న రైతులకు రుణమాఫీ ఉండదని కాంగ్రెస్ చెప్పలేదు కదా అంటున్నారు. పైగా ఉన్న అప్పు కడితే రుణమాఫీ చేస్తారో లేదో అంటూ అన్నదాతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



- మా రుణాలు మాఫీ కాలేదు మహాప్రభో..!
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతుల గగ్గోలు
- ఎన్ని లక్షల అప్పున్నా రూ.2 లక్షలు మాఫీ చేయాలని డిమాండ్
- లేకుంటే అన్నదాతల ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరిక

### రెండువేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు..



నేను గానుగపాడు సహకార సంఘంలో సభ్యుడిని. నాకు రుణ మాఫీ కాలేదు. మా సొసైటీలో 2,850 మంది రైతులకు గాను మూడు విడతల్లో కలిపి కేవలం 850 మందికే రుణమాఫీ అయింది. మిగిలిన 2,000 మందికి రుణమాఫీ కాలేదు. ఈ ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతోంది. రైతులందరికీ రుణమాఫీ చేయడం లేదు. అధికారులు పట్టించుకోవడంలేదు. రుణమాఫీ కాకపోతే ఏం చేయాలో అర్థం కావడం లేదు.

**–భూపతి రమేశ్, రైతు, రావికంపాడు, చండ్రుగొండ**

### నా పంట రుణం కూడా మాఫీ కాలేదు..




గుంపెన సొసైటీలో నేను పంట రుణం తీసుకొని ఉన్నాను. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీలో నా పంట రుణం కూడా మాఫీ కాలేదు. మా గ్రామంలో కొంతమందికే ఈ ప్రభుత్వంలో రుణమాఫీ అయింది. ఎక్కడ చూసినా, ఎవరిని పలుకరించినా రైతులు తమ రుణాలు మాఫీ కాలేదనే చెబుతున్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి. రేషన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకంతో సంబంధం లేకుండా రైతులందరికీ రుణ విముక్తి కల్పించాలి. ఏజెన్సీ ఏరియాలో పహాణీలతో రుణాలు పొందిన రైతుల పంట రుణాలు కూడా మాఫీ చేయాలి.

**– చీదెళ్ల పవన్‌కుమార్, రైతు, చండ్రుగొండ**

తిరుమలాయపాలెం, ఆగస్టు 19 : తిరుమలాయపాలెం మండలంలో 50శాతం రైతులకు కూడా రుణమాఫీ కాకపోవడం గమనార్హం. మండలంలో ఏపీజీవీబీ తిరుమలాయపాలెం, సుబ్లేడు, పాతర్లపాడు, పిండిప్రోలు ఐవోబీ, యూనియన్ బ్యాంక్ బీరోలు, కెనరా బ్యాంకు ఖమ్మంలో తిరుమలాయపాలెం మండలానికి చెందిన 15,179 మంది రైతులకు రూ.123.86 కోట్లు అప్పు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు మూడు విడతలుగా 7,226 మంది రైతులకు రూ.61.33 కోట్లు మాఫీ చేసింది. మండలంలోని బ్యాంకుల్లో ఇంకా 7,953 మంది రైతులకు రూ.62.53 కోట్లు అప్పు మాఫీ కాలేదు. వివిధ బ్యాంకుల్లో రూ.2 లక్షలకు పైగా ఉన్న రైతులకు ఒక్కరికి సైతం రుణమాఫీ కాలేదు. ఇప్పుడేమో రూ.2 లక్షలకు పైగా ఉన్న అప్పు కడితే రుణ మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎప్పటివరకు కట్టాలి, ఎప్పుడు మాఫీ చేస్తారో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం పట్ల అన్నదాతల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలన్నింటినీ తొలిగించి ఎన్ని లక్షల అప్పు అనేది కాకుండా ప్రతి రైతుకూ రూ.2 లక్షలు మాఫీ చేయాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.


పెనుబల్లి : రుణమాఫీలో తమ పేర్లు ఉన్నాయా లేవా అని తెలుసుకుంటున్న రైతులు (ఫైల్)



**టీ.పాలెం మండలంలో..**

మొత్తం రైతులు : 15,179
తీసుకున్న రుణాలు : రూ.123.86 కోట్లు
మాఫీ అయిన రైతులు : 7,226
మాఫీ అయిన రుణాలు : రూ.61.33 కోట్లు


## రుణమాఫీపై షరతులొద్దు..

- అర్హుల రుణాలన్నీ మాఫీ చేయాలి
- వైరాలో నిరసన తెలిపిన రైతులు


వైరా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వైరాటౌన్, ఆగస్టు 19 : షరతులు విధించకుండా అర్హులైన రైతులందరి రుణాలు మాఫీ చేయాలని, పథకం అమలులో వ్యవసాయ శాఖ గుర్తించిన 31 సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైరా తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు సోమవారం నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతు ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల ముందు రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని, ఆ లోపు తక్కువ ఉన్న రైతులు తిరిగి రుణాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చి 50 శాతం రైతుల రుణాలు కూడా మాఫీ చేయలేదని ఆరోపించారు. వైరా సభలో సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ పూర్తయిందని ప్రకటించగా.. మాఫీ కాని రైతులు ఇప్పటివరకు ఆందోళన చెందుతూనే ఉన్నారన్నారు. తుది విడత రుణ మాఫీ తేదీని ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు బొంతు రాంబాబు, కట్టా కృష్ణార్జున్‌రావు, ముళ్ళపాటి సీతారాములు, తోట నాగేశ్వరరావు, మద్దెల రవి, ధనియాకుల వేణు, వనమా విశ్వేశ్వరరావు, అప్పం సురేశ్, భట్టు భద్రయ్య, మాదినేని ప్రసాద్ పాల్గొన్నారు.

### కొర్రీలు మానేసి 2 లక్షలు మాఫీ చేయాలి



కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు మానేసి ప్రతి రైతుకూ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలి. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ సమక్షంలో రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రూ.2 లక్షలకుపైగా ఉన్నవారికి రుణమాఫీ చేయమని చెప్పలేదుగా? గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒకమారు రైతుకు ఎన్ని లక్షలు అప్పు ఉన్నా రూ.లక్ష మాఫీ చేసింది. అలానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ.2 లక్షలు మాఫీ చేస్తే బాగుంటుంది. లేకపోతే రైతుల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదు. నాకు, నా భార్య లలితకు కలిపి రూ.2.69 లక్షల అప్పు ఉంది. మాకు రుణమాఫీ రాలేదు.

**– నీరుడు లాజరస్, రైతు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శి, రఘునాథపాలెం, టీ.పాలెం మండలం**

### ఎన్నికల సమయంలో అలా చెప్పలేదుగా..



రైతులకు రూ.2 లక్షలకు పైగా అప్పు ఉంటే మాఫీ కాదని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చెప్పలేదు. పైగా ఉన్న డబ్బులు కట్టుకుంటేనే మాఫీ వస్తుందని ఎవరైనా చెబితే మేము ఆ పని చేసేవాళ్లం. మాకు ఇద్దరికి కలిసి రూ.2.24 లక్షల అప్పు ఉంది. మాఫీ కాలేదు. ఏమీ చేయాలో తోచడం లేదు.

**– దారావత్ సోమ్లా, రైతు, జోగులపాడు, టీ.పాలెం మండలం**

### పైన 2వేలు ఉన్నందుకే మాఫీ రాలేదు



నాకు రూ.2.10 లక్షల అప్పు ఉంటే రూ. 10,000 అప్పు కట్టి రూ.2 లక్షలు ఉంచాను. బ్యాంకు వారు మరో రూ.2000 వడ్డీ జమ చేశారు. దీంతో నా అప్పు రూ.2 లక్షల రెండు వేలు కావడంతో రుణమాఫీ కాలేదు. నాలాంటి రైతులు ఎందరో ఉన్నారు. బ్యాంకు అధికారుల వైఖరి వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు.

**– రావిళ్ల నాగరాజు, రైతు, పిండిప్రోలు, టీ.పాలెం మండలం**

### రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు..



కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ తీరు బాగోలేదు. అనేక మంది రైతులకు రుణాలు మాఫీ కాలేదు. ఎన్నికల సమయంలో చెప్పింది ఒకటి.. ఇప్పుడు చేసింది మరొకటి. అర్హులందరికీ రుణాలు మాఫీ చేయకపోతే రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ గురికాక తప్పదు. ప్రతి రైతుకూ రూ.2 లక్షలు మాఫీ చేయాలి.

**– చామకూరి రవి, రైతు, పిండిప్రోలు, టీ.పాలెం**

### మా ఊళ్లో 30 మందికి కూడా మాఫీ రాలేదు



మా పిండిప్రోలు గ్రామంలో 30మందికి కూడా రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షలకు పైగా ఉన్నవారికి రుణాలు మాఫీ చేయలేదు. రైతుకు అప్పు ఎంతున్నది అనేది కాకుండా ప్రతి రైతు కుటుంబానికి కాంగ్రెస్ హామీ మేరకు రూ.2 లక్షల మాఫీ చేస్తే బాగుంటుంది. ఇప్పుడు రూ.2 లక్షలకు పైగా ఉన్న అప్పు కట్టినా మళ్లీ మాఫీ వస్తుందని గ్యారంటీ లేదు. దీనిపై ప్రభుత్వం స్పష్టంగా కటాఫ్ తేదీతో ప్రకటన చేయాలి.

**– రామనబోయిన వెంకటేశ్వర్లు, రైతు, పిండిప్రోలు, టీ.పాలెం మండలం**

## కాలువ నిండా నీళ్లు..
# పంట భూములు బీళ్లు

ఒకపక్క కళ్లెదుట ఎన్‌ఎస్పీ కాలువ నిండా నీరు పారుతున్నా.. మరోపక్క తమ పంటలు ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుబల్లి మండలంలోని తాళ్లపెంట ఎత్తిపోతల పథకం(టీఎస్ఐడీసీ) కింద పంటలు పండించుకుంటున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత ఎండాకాలంలో లిఫ్ట్‌కు సంబంధించి విద్యుత్ సరఫరాకు ఉపయోగించే మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీకి గురైంది. విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును అటు ప్రభుత్వం గానీ, ఇటు అధికారులు గానీ పట్టించుకోకపోడంతో పంట పొలాలు బీడుభూములుగా మారుతున్నాయి. – పెనుబల్లి, ఆగస్టు 19

- మూలనపడిన తాళ్లపెంట ఎత్తిపోతల పథకం
- గత ఏడాది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ
- ఇప్పటివరకు పట్టించుకున్న నాథుడు లేడు
- ఎండిపోతున్న 1,560 ఎకరాల పంటలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


తాళ్లపెంట ఎత్తిపోతల పథకం


ఎత్తిపోతల పథకం ఎదుటే ఎండిపోతున్న పొలాలు


రాగివైర్లు చోరీ అయిన ట్రాన్స్‌ఫార్మర్లు

1997లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కర్రాలపాడు, తాళ్లపెంట, ఎర్రబంజర గ్రామాలకు కలిపి తాళ్లపెంట ఎత్తిపోతల పథకం పేరున లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారు. అప్పట్లో 1,560 ఎకరాలకు మూడు గ్రామాల ఆయకట్టుకు సాల్వ, డాల్వ పంటలకు నీళ్లు అందించేందుకు రూ.48 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేశారు. మళ్లీ ఆయనే 1999లో లిఫ్ట్‌ను ప్రారంభించారు. ఆనాటి నుంచి గత సంవత్సరం వరకు ఎన్‌ఎస్పీ జలాలు వస్తే తప్పనిసరిగా రెండు పంటలు ఆ మూడు గ్రామాల రైతులకు అందుతాయి. కానీ గత ఎండాకాలంలో లిఫ్ట్‌కు సంబంధించి విద్యుత్ సరఫరాకు ఉపయోగించే మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీకి గురైంది. విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి స్థానిక రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించలేదు. వానకాలం సీజన్ వచ్చి కరివేద సాగు చేస్తున్న రైతులు, నాట్లు వేసే రైతులు లిఫ్ట్ మరమ్మతులు చేపడతారు, నీళ్లు వస్తాయి, పంటలు పండుతాయన్న ఆశతో ఆయకట్టు పరిసర ప్రాంతం మొత్తం వరిసాగు చేస్తున్నారు. కానీ ఇప్పటివరకు ఆ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో లిఫ్ట్ ఎదురుగానే వరి పంట పొలాలు బీడులుగా మారుతున్నాయి. దీంతో రైతన్నలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉపముఖ్యమంత్రి, ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి, అప్పటి నీటి పారుదలశాఖ మంత్రి , శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసిన మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి, ప్రస్తుతం ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇరిగేషన్‌శాఖ చైర్మన్ అందరూ ఈ ప్రాంత వాసులై ఉండి పేరు గలిగిన తాళ్లపెంట ఎత్తిపోతల పథకంపై దృష్టి సారించాలని, మూడు వేల ఎకరాల్లో పంట ఎండిపోకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు.


### పెద్దలు చొరవ చూపితేనే పంటలు



జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే తాళ్లపెంట లిఫ్ట్ కింద ఉన్న మూడు వేల ఎకరాలు పండుతాయి. లేదంటే పంట పొలాలు సైతం ఎర్రటి బీడుభూములవుతాయి.

**– ఆళ్ల రంగారావు, కర్రాలపాడు, యువరైతు**

### నీళ్లుండి సుఖం లేదు



కళ్ల ముందే ఎన్‌ఎస్పీ కాలువలో నీళ్లు నిండా పారుతున్నాయి. కానీ కాలువ ఒడ్డున ఉన్న పొలాలకు నీళ్లు పెట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. మా బాధలు ఎవరికీ రాకూడదు. లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నీళ్లు అందాయి. కానీ ఇప్పుడు లిఫ్ట్ వస్తాయో రావో అని తెలియడంతో మూడు గ్రామాల రైతులు తీవ్ర ఆందోళనకు పడుతున్నారు. రైతుల బాధలు తెలిసిన ప్రజాప్రతినిధులు వెంటనే కల్పించుకొని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

**– శీలం కృష్ణారెడ్డి, కర్రాలపాడు, రైతు**

### పంటలను కాపాడండి



లిఫ్ట్ కింద ఉన్న రైతులందరూ ఎన్‌ఎస్పీ జలాల పైనే ఆధారపడి అప్పటి మంత్రి తుమ్మల చొరవ చూపి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు లిఫ్ట్‌కు సంబంధించి విద్యుత్ అంతరాయం ఉండడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. రైతులందరూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా రైతుల మొర ఆలకించాలని కోరుతున్నారు. **– ఆళ్ల రమేష్, కర్రాలపాడు, రైతు**

### తొందరగా మరమ్మతులు చేపట్టాలి



అప్పట్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లిఫ్ట్ ఏర్పాటు చేసి నీళ్లు అందించారు. మంచిగానే ఉంది. కానీ ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమవడంతో ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నాం. నారు పోసిన వారు నీళ్ల పోయారా అన్నట్లుగా రైతులకు లిఫ్ట్ మంజూరు చేసి నీళ్లు అందించిన మంత్రి తుమ్మల కల్పించుకొని మరమ్మతులు చేపడితే మూడు గ్రామాల రైతుల ఆయకట్టు కింద ఉన్న పంటలు పండుతాయి. **– కాకా ప్రసాద్, తాళ్లపెంట, రైతు**

## ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించాలి

- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



తిరుమలాయపాలెం ప్రజావాణిలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

తిరుమలాయపాలెం, ఆగస్టు 19 : అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎవరు అశ్రద్ధ కనబరిచినా చర్యలు తప్పవని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలస్యంగా వచ్చిన ఎంపీడీవో శిలార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన పంచాయతీ కార్యదర్శి సునీతపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. మండలంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, విషజ్వరాల వ్యాప్తి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిరుమలాయపాలెం 100 పడకల ఆసుపత్రిని సందర్శించారు. వైద్య సేవల తీరుపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను సూపరింటెండెంట్ కృపా ఉషశ్రీ కలెక్టర్‌కు వివరించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

## వందేళ్లు జీవించిన ఘనత ఆదివాసీలదే..

ట్రైబల్ మ్యూజియం సందర్శనలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్


కళాకృతులను సంకల్ప బృందంతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బూర్గంపహాడ్(భద్రాచలం), ఆగస్టు 19 : అడవిలోని చెట్లూపుట్టలు, కాయకష్టాన్ని నమ్ముకుని వందేళ్లు జీవించిన ఘనత ఆదివాసీలదేనని, వారి ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు ప్రత్యేకమని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ అహ్మదాబాద్ నుంచి వచ్చిన ప్రొఫెసర్, సంకల్ప బృందంతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. మ్యూజియంలో పాతతరం వస్తువులకు సంబంధించిన అంశాలు, గిరిజనులు వాడిన వస్తువుల విధానం గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని ఆదివాసీ గూడేల్లో పాతతరం గిరిజన కుటుంబాలు ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు పాటిస్తూ నేటి తరానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారన్నారు. వివిధ కళారూపాలు తయారు చేస్తున్న కళాకారులను హైదరాబాద్‌కు పంపించి పెద్ద పెద్ద మాల్స్‌లో కళలకు సంబంధించిన వస్తువుల గురించి మెళకువలు తెలిపేలా అవగాహన కల్పిస్తామన్నారు. వీరు తయారు చేసే వస్తువులు, కోయ బొమ్మలే కాకుండా ఇంట్లో అలంకారం కోసం పనికొచ్చే ప్రతి వస్తువును శాస్త్రీయపరంగా తయారు చేసి అమ్మకాలు జరిపేలా చూస్తామన్నారు. అనంతరం మ్యూజియంలో పొందుపర్చిన కళాకృతులను బృందం సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్‌కుమార్, ఆర్ఐ నర్సింహారావు, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి పాల్గొన్నారు.